ఒంటరిగా కూర్చుని ఏడవలేను!

బీసీసీఐ నిబంధనలపై కోహ్లీ అసంతృప్తి

బెంగళూరు: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు వైఫల్య ప్రదర్శన అనంతరం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకొచ్చిన నిబంధలలో భాగంగా.. ఆటగాళ్ల కుటుంబాలను విదేశీ టోర్నీలకు తీసుకెళ్లే విషయంలో బోర్డు విధించిన ఆంక్షలపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆటగాళ్లకు కష్టసమయాల్లో కుటుంబ మద్దతు ఎంతో అవసరమని, తానైతే హోటల్ రూమ్‌లో ఒంటరిగా కూర్చుని ఏడవలేనని కోహ్లీ వ్యాఖ్యానించాడు. శనివారం బెంగళూరులో జరిగిన ఆర్‌సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ సమ్మిట్‌లో కోహ్లీ మాట్లాడుతూ.. 'కుటుంబం పాత్ర గురించి, వాళ్లు ఇచ్చే మద్దతు గురించి కొంతమందికి ఎంతచెప్పినా అర్థం కాదు. మ్యాచ్‌లో ఎంతో తీవ్రతతో ఆడుతుంటాం. ఆట పూర్తికాగానే కుటుంబం చెంతకు చేరితే మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అది ఆటగాళ్లకు చాలా అవసరం. అంతేగానీ మ్యాచ్ ముగిశాక హోటల్ రూమ్‌లోకి ఒక్కడే వెళ్లి విచారిస్తూ కూర్చోవాలా? నేనైతే అలా చేయలేను. ఆట ముగిసినా నేను సాధారణంగానే ఉండాలని కోరుకుంటా. కుటుంబంతో గడిపే ఏ ఒక్క క్షణాన్ని నేను వదులుకోను' అని కుండబద్దలు కొట్టాడు. 45 రోజుల విదేశీ పర్యటనలైతే రెండు వారాలు మాత్రమే కుటుంబాలకు అనుమతినిచ్చిన బీసీసీఐ.. చిన్న టూర్లకు తీసుకెళ్లకపోవడమే మంచిదన్నట్టు సూచించింది. ఇటీవలే ముగిసిన చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత ఆటగాళ్ల కుటుంబాలు దుబాయ్‌లో ఉన్నప్పటికీ వారంతా క్రికెటర్లతో కాకుండా ఇతర హోటళ్లలో ఉండాల్సి వచ్చింది.

కివీస్‌దే తొలి టీ20

పాక్‌కు ఘోర పరాభవం

క్రిస్ట్‌చర్చ్: ఇటీవలే స్వదేశంలో ముగిసిన చాంపియన్స్ ట్రోఫీలో దారుణ వైఫల్యం తర్వాత జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసి సారథిని మార్చినా పాకిస్తాన్ ఆటతీరులో మార్పు రాలేదు. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ఆ జట్టు.. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఘోర పరాభవంతో ప్రారంభించింది. క్రిస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన మొదటి టీ20లో పాక్ 9 వికెట్ల తేడాతో ఓడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. 18.4 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లిద్దరూ డకౌట్ అవగా ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమిత మయ్యారు. మిడిలార్డర్ బ్యాటర్ ఖుష్‌దిల్ (32) ఆదుకోవడంతో పాక్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. కొత్త కెప్టెన్ సల్మాన్ అలీ అఘా (18) విఫలమయ్యాడు. కివీస్ బౌలర్లు జాకబ్ డఫ్ఫీ (4/14), జెమీసన్ (3/8) ధాటికి పాక్ బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. అనంతరం ఛేదనను కివీస్ 10.1 ఓవర్లలోనే దంచేసింది. సీఫర్ట్ (44), ఫిన్ అలెన్ (29 నాటౌట్) వేగంగా ఆడారు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్‌ది సుదీర్ఘమైన చరిత్ర. టోర్నీ ఆరంభం నుంచి ఉన్న జట్లలో ఈ రెండూ ఉన్నాయి. అయితే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మాదిరిగానే ఢిల్లీ, పంజాబ్ సైతం ఇంకా టైటిల్ బోణీ కొట్టలేదు. 17 సీజన్లుగా ఊరిస్తూ వస్తున్న ఐపీఎల్ ట్రోఫీని 18వ సీజన్‌లో అయినా అందుకోవాలని ఇరుజట్లూ ఉవ్విళ్లూరుతున్నాయి. కొత్త కెప్టెన్లు, స్టార్ ప్లేయర్లు, సమర్థమైన హెడ్‌కోచ్‌ల మార్గదర్శకత్వంలో ఆడనున్న ఢిల్లీ, పంజాబ్ 18వ ప్రయత్నంలో అయినా సఫలమవుతాయా? ఈ జట్ల టైటిల్ నిరీక్షణ 2025లో అయినా తీరుతుందా?

బోణీ కొడతారా?

ఐపీఎల్‌లో ఇంతవరకూ టైటిల్ నెగ్గని పంజాబ్, ఢిల్లీ

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఐపీఎల్ ఆరంభ సీజన్ (2008) నుంచి ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు టైటిల్ మాత్రం 17 ఏండ్లుగా అందని ద్రాక్షే అవుతోంది. ఢిల్లీ డేర్ డెవిల్స్‌గా ఆరంభమైన ఆ జట్టు ప్రస్థానం.. కొన్నేండ్ల తర్వాత తమ పేరును ఢిల్లీ క్యాపిటల్స్‌గా మార్చుకుని జయాపజయాలతో సంబంధం లేకుండా అభిమానగణాన్ని సొంతం చేసుకుంది. పేరు మారినా.. పేరు మోసిన సారథులు, నాణ్యమైన ఆటగాళ్లు, మెరుగైన హెడ్‌కోచ్‌లు.. ఇలా ఎంతమంది మారుతున్నా క్యాపిటల్స్ రాత మారడం లేదు. 2020లో ఫైనల్ చేరడమే ఇప్పటిదాకా ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. గత మూడు సీజన్లలో అయితే లీగ్ దశలోనే వెనుదిరిగింది. వీరేంద్ర సెహ్వాగ్, కెవిన్ పీటర్సన్, గౌతం గంభీర్, జహీర్ ఖాన్, మహేళ జయవర్దనే వంటి దిగ్గజ సారథులతో పాటు వర్ధమాన క్రికెటర్లు శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్‌కు సాధ్యం కానిది కొత్త కెప్టెన్ అక్షర్ పటేల్ వల్ల అవుతుందా? బాపు (అక్షర్ ముద్దు పేరు) క్యాపిటల్స్ ఆశలను నెరవేరుస్తాడా? అనేది మరికొద్దిరోజుల్లో తేలనుంది.

ఈసారి పట్టిష్టంగానే..

వేలంలో తమ సారథి పంత్‌ను వదులుకుని మరీ జట్టు ప్రక్షాళన చేపట్టిన ఢిల్లీ ఈసారి బ్యాటింగ్‌లో పటిష్టంగానే కనిపిస్తోంది. గత సీజన్‌లో మెరుపులు మెరిపించిన ఆస్ట్రేలియా కుర్రాడు జేక్ ఫ్రేసర్ మెక్‌గర్క్ ఈ సీజన్‌లో వెటరన్ బ్యాటర్ ఫాఫ్ డుప్లెసిస్‌తో ఓపెనింగ్ చేసే అవకాశముంది. తమదైన రోజున ఈ ద్వయం ప్రత్యర్థులకు చుక్కలు చూపించగలదు. ఇక గత ఆరు సీజన్లలో 500కు పైగా స్కోర్లు చేస్తూ నిలకడకు నిలువుటద్దంలా ఉన్న కేఎల్ రాహుల్ కూడా ఢిల్లీకి ఆడనుండటం ఆ జట్టు బ్యాటింగ్ లైనప్‌ను మరింత పటిష్టపరుస్తోంది. ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పొరెల్‌తో పాటు సారథి అక్షర్ మెరుపులు ఢిల్లీ బ్యాటింగ్‌కు అదనపు ఆకర్షణ. గత సీజన్‌లో పంజాబ్‌కు ఆఖర్లో అనూహ్య విజయాలు అందించిన అశుతోశ్ శర్మ కూడా ఈసారి ఢిల్లీకి ఆడనుండగా అతడు ఫినిషర్ పాత్ర పోషించగలడు. దేశవాళీ టీ20 స్టార్ సమీర్ రిజ్వి సైతం ఈ సీజన్‌లో ఢిల్లీకే ఆడుతుండటంతో బ్యాటింగ్ విభాగంలో ఢిల్లీ పటిష్టంగా కనిపిస్తోంది. బ్యాట్‌తో పాటు బంతితోనూ ఢిల్లీ బలోపేతంగానే ఉంది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను వేలంలో రూ. 11.75 కోట్లకు దక్కించుకున్న ఢిల్లీ.. అతడిపై భారీ ఆశలే పెట్టుకుంది. అతడికి అండగా యార్కర్ల నట్టూ (నటరాజన్), మోహిత్ శర్మ, ముకేశ్ కుమార్ ఉన్నారు. డెత్ ఓవర్లలో ఈ త్రయం కీలకం కానున్నారు. స్పిన్ భారాన్ని అక్షర్, కుల్‌దీప్ మోయనున్నారు. అయితే సిసలైన పేస్ ఆల్‌రౌండర్లు లేకపోవడం ఢిల్లీకి పెద్ద లోటు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్‌ను మినహాయిస్తే ఆ జట్టులో ఆ లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కొత్త కోచ్ హేమాంగ్ బదానీ, మెంటార్ పీటర్సన్ మార్గనిర్దేశకత్వంలో ఢిల్లీ తమ ట్రోఫీ కలలను ఏ మేరకు నెరవేర్చుకుంటుందన్నది ఆసక్తికరం.

ఐపీఎల్‌లో ఇప్పటిదాకా 17 సీజన్లు జరిగితే 17 సార్లూ సారథులను మార్చిన జట్టు ఏదైనా ఉందా? అంటే అది కచ్చితంగా పంజాబ్ కింగ్స్ మాత్రమే. సీజన్ మారిన ప్రతీసారి (ఒక్కోసారి సీజన్ మధ్యలోనే) ఆ జట్టు కెప్టెన్ మారడం ఆనవాయితీగా వస్తోంది. యువరాజ్, సంగక్కర, గిల్‌క్రిస్ట్, బెయిలీ, మ్యాక్స్‌వెల్, అశ్విన్, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, శిఖర్ ధావన్.. ఇలా 17 మంది సారథులు మారారు. తాజాగా 18వ సీజన్‌లో పంజాబ్‌కు కొత్త కెప్టెన్ వచ్చాడు. పదేండ్ల విరామం తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నిరుడు ట్రోఫీని అందించిన శ్రేయస్.. ఈసారి పంజాబ్‌ను నడిపించనున్నాడు. తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడేప్పుడు పనిచేసిన హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ అండగా తమ టైటిల్ ఆశలను శ్రేయస్ నెరవేర్చుతాడని పంజాబ్ భావిస్తోంది. శ్రేయస్ కోసం వేలంలో మిగిలిన ఫ్రాంచైజీలతో పోటీపడి మరీ రికార్డు స్థాయిలో రూ. 26.75 కోట్ల (ఈ లీగ్‌లో రెండో అత్యధిక ధర)కు దక్కించుకున్న పంజాబ్ ఆశలను అయ్యర్ తీర్చుతాడా? పంజాబ్‌ను 'కింగ్'గా నిలబెడుతాడా? సీజన్ మారినా తన సారథ్యానికి డోకా లేదని నిరూపించుకుంటాడా?

ఆల్‌రౌండర్ల మయం

మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మార్కో యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్..

మ్యాచ్‌ను ఎలాంటి పరిస్థితుల్లో అయినా మలుపు తిప్పగల ఆల్‌రౌండర్లు పంజాబ్ సొంతం. లీగ్‌లో ఎవరికీ లేని ఆల్‌రౌండర్ల బలం పంజాబ్‌కు ఉంది. అయితే ఫైనల్ లెవన్‌కు వచ్చేసరికి ఎవరిని ఎంచుకోవాలి? ఎవరిని బెంచ్‌పై కూర్చోబెట్టాలన్నది మాత్రం పంజాబ్‌కు తలనొప్పే. ధావన్‌ను పక్కనబెట్టేయడంతో ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఓపెనింగ్ కాంబినేషన్ కొత్త సమస్యగా మారింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఎవరు ఆరంభిస్తారన్నది ఆసక్తికరం. పైన పేర్కొన్న ఆల్‌రౌండర్ల జాబితాలో చాలామంది ఫినిషర్లే. ఓపెనింగ్ సమస్య తప్పితే టాపార్డర్, మిడిలార్డర్‌లో ఆ జట్టు బ్యాటింగ్ అత్యంత పటిష్టంగా ఉంది. శశాంక్ సింగ్, నెహల్ వధేరా రూపంలో పంజాబ్‌కు అద్భుతమైన ఫినిషర్లు ఉన్నారు. శ్రేయస్ జట్టును నడిపించడంతో పాటు బ్యాట్‌తోనూ అదరగొడితే ప్రత్యర్థులకు తిప్పలు తప్పవు.

ఇక బౌలింగ్ విషయానికొస్తే టీ20లలో అంచనాలకు మించి రాణిస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ఆ జట్టు ప్రధాన బలం. అతడితో కొత్త బంతిని ఎవరు పంచుకుంటారనేది ఆసక్తికరం. అర్ష్‌దీప్, మినహా నమ్మదగ్గ పేసర్ కొరత పంజాబ్‌కు లోటే. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్ల వీరుడిగా ఉన్న యుజ్వేంద్ర చాహల్ ఈసారి పంజాబ్‌తో ఆడనుండటం ఆ జట్టుకు లాభించేదే. ముల్లన్‌పూర్‌తో పాటు ధర్మశాలలో మ్యాచ్‌లు ఆడనున్న కింగ్స్.. ఓవర్‌సీస్ ప్లేయర్లపై ఎక్కువగా ఆధారపడ్డా కష్టమే. విదేశీ ఆటగాళ్ల బెంచ్ బలంగా ఉన్నప్పటికీ తుది జట్టులో ఉండేది నలుగురే. అయితే దేశవాళీల్లో మంచి రికార్డు కలిగిన ఆటగాళ్లలో శశాంక్ మినహా పంజాబ్‌కు ప్రత్యామ్నాయం లేకపోవడం ఆ జట్టుకు భారీ ఎదురుదెబ్బ.

180 చెస్ బోర్డులపై.. 9.41 నిమిషాల్లో చెక్‌మేట్

చిన్నారి కార్తికేయ ప్రపంచ రికార్డు

మిర్యాలగూడ, మార్చి 16: చదరంగంలో భారత ఆధిపత్యానికి తిరుగులేదని మరోసారి నిరూపిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పదేండ్ల గుండా కార్తికేయ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 180 చెస్ బోర్డులపై ఏకధాటిగా అత్యంత వేగంగా పావులు కదుపుతూ కేవలం 9.41 నిమిషాల్లోనే చెక్‌మేట్ పెట్టి నోబెల్ బుక్ ఆఫ్ రికార్డులలో చోటు సంపాదించుకున్నాడు. గతంలో నారా దేవాన్ష్.. 11.59 నిమిషాల్లో నెలకొల్పిన రికార్డును తాజాగా కార్తికేయ బ్రేక్ చేశాడు. మిర్యాలగూడకు చెందిన గుండా మహేశ్, చంద్రకళ దంపతులు కుమారుడైన కార్తికేయ.. స్థానిక సంస్కృతిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం యాద్గార్‌పల్లిలోని డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోటీలలో అతడు ఈ ఘనతను అందుకున్నాడు. నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులుగా అంతర్జాతీయ చెస్ క్రీడాకారులైన ఆశా, అంకిత్ గౌడ్, అరవింద్ సమక్షంలో ఈ పోటీలు జరిగాయి.

ఇండియాదే ఇంటర్నేషనల్ మాస్టర్స్ టైటిల్

ఫైనల్‌లో వెస్టిండీస్‌పై గెలుపు

రాయ్‌పూర్: మాజీ క్రికెటర్లు ప్రాతినిథ్యం వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ టీ20 తొలి సీజన్ టైటిల్‌ను సచిన్ టెండూల్కర్ సారథ్యంలోని ఇండియా మాస్టర్స్ గెలుచుకుంది. వెస్టిండీస్ మాస్టర్స్‌తో రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఫైనల్ పోరులో ఇండియా.. 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బ్రియాన్ లారా సారథ్యంలోని వెస్టిండీస్.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 148 పరుగులకే పరిమితమైంది. సిమ్మన్స్ (57) టాప్ స్కోరర్ కాగా డ్వేన్ స్మిత్ (45) రాణించాడు. లక్ష్యాన్ని ఇండియా.. 17.1 ఓవర్ల లోనే ఛేదించింది. వికెట్ కీపర్ బ్యాటర్ అంబటి రాయుడు (50 బంతుల్లో 74, 9 ఫోర్లు, 3 సిక్సర్లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. సచిన్ (18 బంతుల్లో 25, 2 ఫోర్లు, 1 సిక్స్) తనదైన ట్రేడ్‌మార్క్ షాట్లతో అభిమానులను అలరించాడు. యువరాజ్ (13 నాటౌట్), బిన్నీ (16 నాటౌట్) లాంచనాన్ని పూర్తిచేశాడు.

డబ్బు కోసం అడ్డదారులు

- బెట్టింగ్, లోన్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు
- విలువైన బహుమతులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్ల పేరుతో గాలం
- ఈజీ మనీ కోసం గుడ్డిగా ఫాలో అవుతున్న టీనేజర్లు
- ఉన్న డబ్బంతా కోల్పోయి, లోన్ యాప్‌ల వైపు మొగ్గు
- ఆపై అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లలో చాలా మంది సామాజిక బాధ్యతను మర్చిపోతున్నారు. డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌లను అడ్డగోలుగా ప్రమోట్ చేస్తూ తమను గుడ్డిగా ఫాలో అవుతున్నవారిని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. సైబర్ మోసగాళ్లు ఇచ్చే డబ్బులకు కక్కుర్తిపడి పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ల పేరుతో ఫాలోవర్స్‌ను బలి చేస్తున్నారు. అలాంటి ఇన్‌ఫ్లూయెన్సర్లలో కొందరు ఇప్పటికే కటకటాలు లెక్కిస్తుండటంతో మిగిలిన వారు ఇరకాటంలో పడ్డారు. కలుగుల నుంచి ఎలుకల్లా బయటికి వచ్చి.. తాము చేసింది తప్పేనని, ఇక నుంచి అలాంటి తప్పులు చేయబోమని క్షమాపణలు కోరుతున్నారు.

విలువైన బహుమతులు ఆశ చూపి..

'మీకు ఐఫోన్-15 కావాలా? ఖరీదైన వాచ్‌లు కావాలా? అయితే వెంటనే నా చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి. కింద ఉన్న టెలిగ్రామ్ లింక్‌ను ఓపెన్ చేసి, నా చానల్‌లో చేరండి. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి. లేదంటే చిన్న చిన్న గేమ్స్ ఆడి విలువైన బహుమతులను సొంతం చేసుకోండి. గేమ్‌లో గెలిచి డబ్బులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు పొందండి' అంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ తన యూట్యూబ్ అకౌంట్‌లోని దాదాపు 42.2 లక్షల మంది సబ్‌స్క్రైబర్లకు ప్రతిరోజూ ఆశపెడుతున్నాడు. అతను ఇచ్చిన టెలిగ్రామ్ లింక్‌ను ఓపెన్ చేస్తే నేరుగా అతని చానల్ ఓపెన్ అవుతుంది. అందులో అతను చెప్పినట్టుగా టెలిగ్రామ్ వీడియో కింద ఇచ్చిన లింక్‌ను ఓపెన్ చేస్తే నేరుగా '1విన్' అనే బెట్టింగ్ యాప్ ఓపెన్ అవుతుంది. అందులో కనీసం రూ.300 బెట్టింగ్ పెట్టమంటాడు. అలా పెడితే.. మొదటిసారి కనీసం రూ.600 వస్తాయి. ఆ డబ్బులతో మళ్లీ బెట్టింగ్ పెడితే విన్నింగ్ అమౌంట్ పెరుగుతూనే ఉంటుంది. అలా మనతో సాధ్యమైనంత ఎక్కువ బెట్టింగ్ పెట్టించి మొత్తం సొమ్మును ఒకేసారి కాజేస్తారు. ఇలాంటి యాప్‌లను ఫాలోవర్స్‌కు అంటగడుతున్న ఇన్‌ఫ్లూయెన్సర్లకు భారీగా నగదుతోపాటు బైక్‌లు, కార్ల లాంటి ఖరీదైన బహుమతులు అందుతున్నట్టు సమాచారం.

డబ్బుల కోసం లోన్‌యాప్‌ల రొంపిలోకి..

ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పే బెట్టింగ్ యాప్‌లకు ఎంతో మంది యువకులు బానిసలై భారీగా డబ్బులు కోల్పోతున్నారు. అంతటితో ఆగకుండా డబ్బుల కోసం అదే ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పిన లోన్‌యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వకపోయినా రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఇస్తుండటంతో ఆ యాప్‌ల నుంచి లోన్లు తీసుకుంటున్నారు. వాటిని తీర్చలేక, ఇంట్లో చెప్పలేక, చదువు ముగించలేక తీవ్ర మానసిక ఒత్తిడికిలోనై బలవంతంగా ప్రాణాలు తీసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

ఇన్‌ఫ్లూయెన్సర్లపై చర్యలేవీ?

బెట్టింగ్, లోన్ యాప్‌లను అడ్డగోలుగా ప్రమోట్ చేస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై చర్యలు చేపట్టడం లేదని పోలీసులు, సీఎస్పీ అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేవారిని కట్టడి చేయాలని, కనీసం వారికి కౌన్సెలింగ్ అయినా ఇచ్చి హెచ్చరికలు జారీచేయాలని ఎంతో మంది కోరుతున్నారు.

బెట్టింగ్ ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు పెట్టండి..

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల వల్ల ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌లో మోసపోయినవారు బయటికి రావాలి. ఆ యాప్‌లలో బెట్టింగులు పెట్టేలా మిమ్మల్ని పురిగొల్పిన ఇన్‌ఫ్లూయెన్సర్లపై సమీప పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టాలి. బెట్టింగ్ యాప్స్‌ను బ్యాన్ చేయించేందుకు మేం చేపట్టిన ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, సెలబ్రిటీలు కలిసి రావాలి. యువతను కాపాడుకోవడం మనందరి బాధ్యత. జూదంతో జీవితాలే తల్లకిందులవుతాయని మహాభారత కాలం నుంచే ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. పిల్లలు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి ఏం చేస్తున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. నిండా మునిగిన తర్వాత ఎంత బాధపడినా ఫలితం ఉండదు.

– సజ్జనార్, ఆల్టినీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి

బందగీ గోపి తీసిన ఫొటో, (ఇన్‌సెట్లో)గోపి

'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్‌కు ఉత్తమ అవార్డు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 16 : మహబూబ్‌నగర్ జిల్లా 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్ బందగీ గోపి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. గత ఏడాది ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్లను ఎంపిక చేయగా సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గోపి అవార్డును అందుకోనున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన గోపికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు అభినందనలు తెలిపారు.

'బైదూ' నుంచి రెండు కొత్త ఏఐ మోడళ్లు

ఎర్నీ 4.5, ఎక్స్ 1 చాట్‌బాట్ల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, మార్చి 16: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పోటీ పెరగడంతో కొత్త మోడళ్ల రాక ఎక్కువైంది. ఈ క్రమంలో చైనా సెర్చింజన్ దిగ్గజం 'బైదూ' తాజాగా రెండు కొత్త ఏఐ మోడళ్లను ఆవిష్కరించింది. ఎర్నీ 4.5, ఎక్స్1 పేరుతో ఈ చాట్‌బాట్లను తీసుకొచ్చింది. ప్రతి అంశాన్ని అర్థం చేసుకుని, విశ్లేషించగల సామర్థ్యం వీటికి ఉన్నట్టు 'బైదూ' వెల్లడించింది. మల్టీ మోడల్ సామర్థ్యం కలిగిన ఈ రెండు చాట్‌బాట్లకు అద్భుతమైన మెమరీ, ఐక్యూ ఉన్నదని, టెక్స్ట్, ఫొటోలు, వీడియోలు, ఆడియోలు సహా అనేక రకాల సమాచారాన్ని ఇవి విశ్లేషించగలవని పేర్కొంది. ముఖ్యంగా ఎక్స్1 మోడల్ ఏ విషయాన్నైనా అర్థం చేసుకుని ప్రణాళికలు రచించగలదని, అటానమస్ ఎబిలిటీతో కూడిన డీప్ థింకింగ్ ఏఐ మోడళ్లలో ఇదొకటని 'బైదూ' తెలిపింది.

విద్యుత్తు కనెక్షన్‌కు రెండు నెలలు ఆగాల్సిందే!

- **కొత్త కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం**
- **పరిశ్రమల వర్గాలకు తప్పని తిప్పలు**

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : పరిశ్రమలకు కొత్త విద్యుత్తు కనెక్షన్ కావాలన్నా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరికరాలు పాడైపోయినా కనీసం రెండు నెలలు ఆగాల్సిన పరిస్థితి నెలకొన్నది. అవసరాలకు సరిపడా పరికరాల సరఫరా లేకపోవడంతో జాప్యం తప్పడంలేదని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా విద్యుత్తు కనెక్షన్ కావాల్సినవారు ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు, స్తంభాలు ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటే, వాటిని బిగించేందుకు అవసరమైన ఏబీ స్విచ్‌లు, ఇన్సులేటర్లు, విద్యుత్తు సరఫరా నియంత్రణ పరికరాలు, సీటీ పీటీ మీటర్లను విద్యుత్తుశాఖ ఏర్పాటుచేస్తుంది. వీటికి అయ్యే ఖర్చును వినియోగదారుడి నుంచి వసూలుచేస్తుంది. సహజంగా పరిశ్రమలకు వారం లోగా విద్యుత్తు కనెక్షన్ మంజూరుచేసి ట్రాన్స్‌ఫార్మర్ బిగించే ప్రక్రియ పూర్తవుతుంది. అయితే, కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసుకున్నా.. సకాలంలో వీటిని సమకూర్చడంలో విద్యుత్తుశాఖ విఫలమవుతున్నది. దీంతో కనెక్షన్ల మంజూరులో జాప్యం తప్పడం లేదు.

డీఎస్సీ స్పోర్ట్స్‌కోటాలో స్కామ్?

నియామకంలో విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ పెద్దల చేతివాటం

స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల ఆరోపణ.. సమగ్ర విచారణకు డిమాండ్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): "అత్యంత వేగంగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. 10వేలకు పైగా టీచర్ ఉద్యోగాలిచ్చాం." ఇవీ రాష్ట్రప్రభుత్వ పెద్దలు చెప్పే గొప్పలు. కానీ ఇదే డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా టీచర్ ఉద్యోగాల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ అధికారులను నిలదీస్తే సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారని అభ్యర్థులు మండిపడుతున్నారు. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే రెండు శాఖల పెద్దలు నాన్చుడు ధోరణి అనుసరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. భారీ కుంభకోణంలో ఏ పెద్దల ప్రమేయముందో తేలాలంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలన నివేదికలు దాచడమెందుకు?

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 95 పోస్టులుండగా, ఆ క్యాటగిరీలో 8వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత ఈ క్యాటగిరీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ బాధ్యతలను ప్రభుత్వం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించింది. అక్టోబర్‌లో మొత్తం 393 మంది అభ్యర్థుల సర్టిఫికేట్లను పరిశీలించారు. కోటాలోని 95 పోస్టులకు 33 మందికి ఉద్యోగాలిచ్చారు. మిగిలిన 62 పోస్టులను ఓపెన్ కోటాకు మళ్లించారు. కానీ పోస్టులివ్వడంలో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు ఆరోపించారు. దీంతో నవంబర్ 20, 21, 22 తేదీల్లో కిందిస్థాయి అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. జనవరి 3,4న ఉన్నతా